


సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1716, బ్యాంక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం బుధవారం 566.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.



70,663 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 68,127 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 70,663 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

నేడు చీరాలకు కేంద్ర బృందం రాక

బాపట్ల: దేశ స్థాయిలో ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి అనే నినాదంతో బాపట్ల జిల్లా చీరాల సిల్క్ శారీస్, ఉప్పాడ వస్త్రాలను అవార్డుకు ఎంపిక చేయడానికి కేంద్ర బృందం గురువారం జిల్లాకు వస్తోందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పర్యటన వివరాలను చేనేత జౌళీ శాఖ అధికారులకు కలెక్టర్ వెల్లడించారు. కేంద్ర బృంద సభ్యులు ఇషదీప్, దివ్య ఉదయం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం చీరాల మండలం ఈపూరు గ్రామంలోని సమత శిక్షణ కేంద్రం, దేశాయిపేటలో డయింగ్ యూనిట్, జాండ్ర పేటలోని చేనేత కార్మికుల గృహాలు, గౌతమ్ హ్యాండ్లూమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను, మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్‌ను సందర్శిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ కె.కన్నాబాబు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ భీమయ్య పాల్గొంటారన్నారు.

లోక్ అదాలత్‌పై కక్షిదారులను చైతన్య పరచాలి



రేపల్లె రూరల్: లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని న్యాయవాదులకు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ మండల చైర్మన్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని సబ్ కోర్టు హాలులో న్యాయవాదులకు లోక్ అదాలత్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ..లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వరమే న్యాయం జరిగి, సమయం, ధనం ఆదా అవుతాయన్నారు. న్యాయవాదులు ఆయా అంశాలపై కక్షిదారులను చైతన్య పరచాలని తెలిపారు. అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ, కార్యదర్శి ఒ.రాంబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అరుణాచలం పవిత్ర పుణ్యక్షేత్రంలో ఈనెల 13న జరుగనున్న పౌర్ణమి గిరిప్రదక్షిణ మహోత్సవాలకు సంబంధించి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. గుంటూరు -2 డిపో నుంచి ఈనెల 11 రాత్రి 9.15 గంటలకు బస్సు బయలుదేరి 12వ తేదీ కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకున్న అనంతరం అదే రోజు రాత్రి అక్కడి నుంచి బయలుదేరి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. 13వ తేదీన భక్తులు గిరిప్రదక్షిణలు చేసుకుని, అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం అరుణాలచలంలో బయలుదేరి 14వ తేదీ ఉదయం 6 గంటలకు గుంటూరు చేరుకుంటుందని వివరించారు. ఒక్కో టికెట్ ధర రూ. 2,420లు అని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7382897459 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మహంకాళీ అమ్మవారి గుడి హుండీ ఆదాయం లెక్కింపు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్ కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీల్లోని కానుకలను గుంటూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.వెంకట శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెరిచి లెక్కించగా రూ. 12,66,254 ఆదాయం వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి.రంగ ప్రసాద్ పాల్గొన్నారు.

46 మందికి పీహెచ్‌ఎన్‌లుగా ప్రమోషన్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో హెల్త్ విజిటర్స్‌గా పనిచేస్తున్న 46 మందికి పబ్లిక్ హెల్త్ నర్సులుగా ప్రమోషన్ లభించింది. బుధవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



కో..కో..

రూ.కోట్లు కొట్టాలా!



- 13, 14, 15 తేదీల్లో భోగి, సంక్రాంతి, కనుమ
- కానీ, టీడీపీ నేతలకు కోడి పందెం, పేకాట, గుండాట
- ఇక అంతా బహిరంగమే.. చాటుమాటుకు తావు లేదు
- జూదాలతో రూ.కోట్లు కొల్లగొట్టే ప్రణాళికలో తమ్ముళ్లు
- రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో భారీగా బరులు
- టీడీపీ జెండాలతో రెపరెపలాడుతున్న మైదానాలు
- ఇతర జిల్లాల జూదరులకు ముందే ఆహ్వానం



కొల్లూరు మండలం అనంతవరంలో టీడీపీ జెండాలతో ఏర్పాటు చేసిన కోడి పందేల బరి

కొల్లూరు: సంక్రాంతి పండగ వచ్చేసింది. సంబరాల మాటున జూదాల నిర్వహణకు కూటమి పార్టీల నేతలు తెరతీశారు. ఐదేళ్ల అధికారం కోల్పోయిన తెలుగు తమ్ముళ్లు అక్రమార్జన కోసం నకనకలాడుతున్నారు. ఇప్పటికే ఇసుక, మద్యం మీద పడి దోచుకుంటున్న వీరి కన్ను సంక్రాంతి పండగపై పడింది. సంబరాల మాటున రూ.కోట్లు దండుకునే ప్రణాళికలు సిద్ధం చేశారు. చాటుమాటుగా నిర్వహించే కోడి పందేలు, పేకాట, గుండాట ఇతర జూద క్రీడలను బహిరంగంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణా నదీ తీరం వెంబడి పొలాలను చదును చేసి కోడి పందేల నిర్వహణకు బరులు సిద్ధం చేస్తున్నారు. బరిలో కోడిపుంజు కత్తికట్టి.. ప్రత్యర్థిని కొడితే రూ.కోట్లు రాలేలా భారీగానే వ్యూహరచన చేస్తున్నారు. బరుల చుట్టూ గుంజలు పాతి టీడీపీ జెండాలను ఎగురవేసి.. ఇవి తమ జూద స్థావరాలని బహిరంగంగానే సూచనలు చేస్తున్నారు. సామాన్యులకు సంక్రాంతి అంటే.. భోగి మంటలు, పిండి వంటలు, పశువులకు పూజలు, పెద్దలకు నివాళులు, పతంగుల విహంగాలు కానీ, కూటమి పార్టీల నేతలకు కోడి పందేలు, పేకాట, గుండాట శిబిరాల నిర్వహణగా మారిపోయింది.

తిరునాళ్లను తలపించేలా..

కోడి పందేల బరులు, జూద శిబిరాల వద్ద వాహనాల పార్కింగ్ మొదలు మద్యం అమ్మకాలు, చిరుతిండ్ల దుకాణాల నిర్వహణకు నగదు వసూళ్లు చేస్తున్నారు. పందెంలో గెలుపొందిన కోడి పుంజు యజమాని నుంచి పందెం కలిపిన సొమ్ములో 10 నుంచి 15 శాతం కమిషన్ ఇవ్వాలని నిర్వాహకులు మాట్లాడుకుంటున్నారు. దీంతో పెద్ద మొత్తంలో జేబులు నిండనున్నాయి.

జూద శిబిరాలకు భారీగా డిమాండ్

కోడి పందెం నిర్వాహకులతో పాటు పాటు పందె కాసేందుకు కూడా అధిక సంఖ్యలో ప్రజలను రాబట్టడం ద్వారా పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నిర్వహించేలా కూటమి నేతలు చూస్తున్నారు.

రేపల్లె, వేమూరు నియోజకవర్గాలే కేంద్రం

రేపల్లె, వేమూరు నియోజకవర్గాలను టీడీపీ నాయకులు జూదాల నిర్వహణకు కేంద్రంగా ఎంచుకున్నారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు, వేమూరు, భట్టిప్రోలు మండలాల్లో కోడి పందేల నిర్వహణకు అధిక విస్తీర్ణంలో బరులను సిద్ధం చేశారు. కొల్లూరు మండలంలో అనంతవరం, కొల్లూరు శివారు బోసు నగర్ ప్రాంతాల్లో రెండు బరులను ఇప్పటి పూర్తి చేశారు. ముఖ్యంగా కూటమి పార్టీల నేతల పోటీ పడి మరీ.. తెనాలి-రేపల్లె, తెనాలి-చిలుమూరు ప్రధాన రహదారుల వెంబడి 10 నుంచి 12 ఎకరాల పంట పొలాలను లీజుకు తీసుకున్నారు.

కోడి పందేలపై ప్రత్యేక నిఘా

కోడి పందేలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. జూద క్రీడల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవు. గత పందేల నిర్వాహకులతో పాటు కోడి కత్తులు కట్టే వ్యక్తులను గుర్తించి, బైండోవర్ చేసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలివ్వడం జరిగింది. ప్రస్తుతం బరులు ఏర్పాటు చేస్తే.. వారికి నోటీసులు జారీ చేయమని ఆదేశాలిచ్చాం.

– ఆవుల శ్రీనివాసరావు, డీఎస్పీ, రేపల్లె

బరులు నిర్వాహకులు ముందుగానే పేకాట, ఇతర జూద క్రీడల శిబిరాలకు పెద్ద మొత్తంలో రేట్లు నిర్ణయించి, కేటాయించారు. బాపట్ల, ప్రకాశం, గుంటూరు,పల్నాడు, కృష్ణా జిల్లాల నుంచి జూదరులను అధిక సంఖ్యలో ఆహ్వానించి రూ.కోట్లలో పందేల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేపట్టారు.

పోలీసు యంత్రాంగం ఎక్కడ?

పెద్ద ఎత్తున కోడి పందేల నిర్వహణకు అధికార పార్టీ నాయకులు బరుల ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ పోలీసు యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. కోడి పందేలు, పేకాట నిషేధించినా.. నిర్వాహకులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లే ప్రధాన కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కొల్లూరు శివారు బోస్ నగర్ సమీపంలో సిద్ధమవుతున్న బరి

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ మోహనరావు

బాపట్ల: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అకౌంట్స్ అధికారి డీఎస్ మోహనరావు పేర్కొన్నారు. బాపట్ల శాఖ అధ్యక్షుడు వై.వి.నరసింహారావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బాపట్ల తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డేను స్థానిక ఎన్జీవో హోమ్‌లో బుధవారం నిర్వహించారు. డీఎస్ నఖారా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మోహన్‌రావు మాట్లాడుతూ ఫ్యామిలీ పెన్షన్లకు సంబంధించి పుట్టిన తేదీ, పేరులో సవరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఉత్తర్వులు త్వరలో వస్తాయని తెలిపారు. సంఘం రాష్ట్ర ట్రెజరర్ పి.నాగరాజు మాట్లాడుతూ బాపట్ల జిల్లా అయినప్పటికీ సంఘానికి భవనం లేదని, స్థానిక ఎన్జీఓ హోమ్‌లో కనీసం 50 గజాల స్థలం కేటాయిస్తే భవనాన్ని నిర్మించుకుంటామన్నారు. నూతన సంవత్సర పెన్షనర్స్ సంఘం డైరీని ఆవిష్కరించారు. సీనియర్ పెన్షనర్లు టి.వెంకటరంగం, ఎల్.మాణిక్యరావ్, విశ్వేశ్వరరావు, శివ బ్రహ్మం, టి.వల్లయ్య, మహదేవ్, కృష్ణ ప్రసాద్, వీరభద్రయ్య, కె.శైలజను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎస్‌పీ శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్కుమార్, ఎస్.నారాయణ, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ జగన్నాథరావు, ఏటీఓ ఎస్.అనురాధ, సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎస్.అనూరాధ పాల్గొన్నారు.

భారీగా మద్యం పట్టివేత

265 మద్యం, 25 బీర్ బాటిళ్లు స్వాధీనం



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది

వేటపాలెం: మత్స్యకార గ్రామంలో బెల్టు షాపుల నిర్వాకులపై దాడి చేసి 265 మద్యం, 25 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. నిర్వాహకుడు దేశాయిపేట గ్రామం దంతంపేటకు చెందిన బొడ్డు నాగశంకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి, మద్యం బాటిళ్లు ఏ దుకాణం నుంచి వచ్చాయో విచారిస్తున్నట్లు తెలిపారు. అయితే మండల పరిధిలోని రెండు మద్యం షాపుల యజమానులు మత్స్యకార గ్రామంలో బెల్టు షాపు నిర్వహణకు వేల పాట నిర్వహించినట్లు సమాచారం. అధికార పార్టీకి సంబంధించిన మద్యం షాపు యజమానికి చెందిన బెల్టు షాపు యథావిధిగా కొనసాగుతుందనే ఆరోపణలున్నాయి. మరో మాజీ ప్రజాప్రతినిధి తాలూకు బెల్టు షాపుపై దాడి చేసి, భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం మద్యం షాపు యజమానులు బెల్టు షాపు నిర్వహణలో పోటీ పడుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు పూర్తిగా విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం

జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల: జిల్లాలో అర్హులైన నిరుపేదలందరూ పీఎంఏవై 2.0 పథకం కింద ఇళ్లు నిర్మించుకోడానికి కేంద్ర ప్రభుత్వం రూ.2.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. విజన్ బాపట్ల-2047 అమలు ప్రణాళికపై 14 శాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా యూడీఏ పరిధిలో ఉన్నందున అర్హులైన నిరుపేదలందరికీ పీఎంఏవై 2.0 పథకం వర్తిస్తుందని కలెక్టర్ చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా సచివాలయాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో లక్ష గృహ ప్రవేశాల కార్యక్రమం సందర్భంగా జిల్లాలో గృహాల ప్రస్తుత పరిస్థితిపై కలెక్టర్ ఆరా తీశారు. గృహాలు పూర్తికాని చోట లక్ష్యాలు పూర్తి చేసేలా మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అక్రమ రవాణాను అరికట్టాలని చెప్పారు. ఐవీఆర్ఎస్ ద్వారా ఇసుక కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారని తెలిపారు. అటవీ శాఖ ద్వారా 4.13 లక్షల మొక్కలను నాటించి, జిల్లాను పచ్చదనంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. బీచ్‌ల వద్ద 200 హెక్టార్లలో మడ మొక్కలను నాటి సుందరీకరించాలని అన్నారు. సీపీఓ అధికారి శ్రీనివాస్, 14 శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ.9.28 కోట్ల నిధులు తక్షణం కావాలి

జల వనరుల సంరక్షణ, పంట కాల్వలు, చెరువుల గట్ల బలోపేతానికి రూ.9.28 కోట్ల నిధులు అత్యవసరమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సాధికారత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌పీ సిసోడియ అమరావతి నుంచి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబర్‌లో జిల్లాలో జరిగిన వరద విపత్తు నిర్వహణపై జిల్లా కలెక్టర్‌తో ఆయన మాట్లాడారు. కృష్ణా నది వరద విపత్తును సమర్థంగా ఎదుర్కొన్నామని, జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేసిందని కలెక్టర్ వెంకట మురళి సిసోడియాకు వివరించారు. ఆగస్టులో రూ.2 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.5 కోట్ల నిధులు జిల్లాకు విడుదల అయ్యాయన్నారు. ఆశ్రయం, సహాయక చర్యలకు రూ.6.31 కోట్లు ఖర్చు అయ్యిందని.. మిగిలిన రూ.69 లక్షలు ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ చెప్పారు. దెబ్బ తిన్న గృహాలకు, పంట నష్ట పరిహారం రూ.45 కోట్లు ప్రభుత్వమే నేరుగా పంపిణీ చేసిందన్నారు. డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, అగ్నిమాపక, విపత్తుల నిర్వహణాధికారి మాధవ నాయుడు, జె.జెనమ్మ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

చారిత్రాత్మక సంపదను భద్రపరిచి, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. పర్యాటక శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో ఆయన సమావేశమయ్యారు. కాకతీయులు, చోళులు నాటి దేవాలయాలు వారసత్వ సంపదగా జిల్లాలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. బాపట్ల సూర్యలంక బీచ్‌ని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. హెచ్‌పీవీ పైప్ ఏర్పాటుతో సురక్షితంగా సముద్రంలో మునగడానికి వీలుంటుందని చెప్పారు. ప్రతిపాదనలు ప్రభుత్వాలకు పంపాలన్నారు. 1,650 కొబ్బరి మొక్కలు నాటడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పర్యాటక శాఖ ద్వారా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే జిల్లా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ వివరించారు. ఇందుకు కేంద్రానికి నివేదిక పంపాలని సూచించారు. పర్యాటక శాఖ ఆపరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి, శివషరమ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాష్టీకం

- డిగ్రీ చదువుతున్న విద్యార్థిని చితకబాదిన పోలీసులు
- బొల్లాపల్లి ఎస్సై తీరుపై తీవ్ర ఆరోపణలు
- కొట్టాక బాధితుడిని ఆసుపత్రికి తరలించిన వైనం

నర్సరావుపేట: వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో పోలీసుల దాష్టీకాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా బొల్లాపల్లి మండలం వెంకట రెడ్డిపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన కుటుంబంలోని వారిపై దాడులు చేయడమే కాకుండా మరో వైపు పోలీసులు దాడులు చేసి దారుణంగా కొట్టిన ఘటన వెలుగు చూసింది. సేకరించిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వాంకుడావవత్ బాలు నాయక్‌కు చెందిన ఆవులు తమ చేలో పడ్డాయని అదే గ్రామానికి చెందిన గాలం శ్రీను, పవన్ అనే వ్యక్తులు.. బాలునాయక్ భార్య వాకిలీబాయి, కుమారుడు దుర్గాప్రసాద్ నాయక్‌తో గత నెల 2వ తేదీన ఘర్షణకు దిగారు. అప్పుడు పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. తరువాత టీడీపీ నాయకుల ఒత్తిడితో ఈ నెల 7వ తేదీన బాలు నాయక్ కుమారుడైన దుర్గాప్రసాద్ నాయక్‌ను పొలంలో పని చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని బొల్లాపల్లి స్టేషనుకు తరలించారు. అదే రోజు పోలీసులు తమదైన శైలిలో దుర్గాప్రసాద్ శరీరంపై వాతలు తేలేటట్లు కొట్టడంతో సొమ్మసిల్లి పడిపోయాడు. కంగారుపడిన పోలీసులు వెంటనే బొల్లాపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలకు దుర్గాప్రసాద్‌ను తరలించారు. అక్కడ లాభం లేదని, మెరుగైన చికిత్స కోసం వినుకొండ తరలించాలని వైద్యులు సూచించారు. వెంటనే ప్రయివేటు అంబులెన్సులో వినుకొండలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి బాధితుడిని మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎస్సై బాలకృష్ణ అత్యుత్సాహం

బొల్లాపల్లి ఎస్సై బాలకృష్ణ వ్యవహారశైలిపై మొదటి నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వెంకటరెడ్డిపురం గ్రామం కేసులో కూడా దుర్గాప్రసాద్ నాయక్‌ను తీవ్రంగా కొట్టారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. డిగ్రీ చదువుతున్న దుర్గాప్రసాద్ నాయక్ భవితవ్యం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పోలీసుల తీరును తప్పుపడుతూ న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు.

న్యాయపోరాటం చేస్తాం

దీనిపై దుర్గాప్రసాద్ బాబాయి కాశోజి నాయక్ మాట్లాడుతూ... ''బొల్లాపల్లి ఎస్సై మా బంధువైన దుర్గాప్రసాద్‌ను కావాలనే కొట్టారు. సొమ్మసిల్లి పడిపోయిన తర్వాత పోలీసులే హాస్పిటల్‌కు తరలించారు. బూట్ కాలితో తన్నడమే కాకుండా, బెల్టుతో వాతలు పడేలా కొట్టారు. న్యాయం చేయాల్సిన పోలీసులే ఇలా ప్రవర్తించడం దారుణం. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని'' తెలిపారు.


నేడు రాధాకృష్ణుల కల్యాణోత్సవం

అమరావతి: అమరావతిలోని భవద్గీతా మందిరంలో వేంచేసియున్న రాధాకృష్ణుని కళ్యాణ మహోత్సవాలు గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకుడు వలివేటి చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పెళ్లి అలంకరణ, ఎదుర్కోలు, రాధాకృష్ణుల కళ్యాణోత్సవం, సాయంత్రం స్వామి గ్రామోత్సవం ఉంటాయని పేర్కొన్నారు. అలాగే 10వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం ఉంటుందన్నారు. ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యుల సామూహిక గీతాపారాయణం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ముక్కోటికి మంగళాద్రి ముస్తాబు

రేపు స్వామి ఉత్తర ద్వార దర్శనం

- బంగారు శంఖుతో తీర్థం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ అధికారులు



ముస్తాబు చేసిన ఉత్తర ద్వార గోపురం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరిలోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఏకాదశి రోజు తెల్లవారుజాము 4 గంటల నుంచే స్వామి దేవేరుల సమేతంగా బంగారు గరుడ వాహనంపై ఉత్తరద్వార ద్వారా భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. దీనికోసం ఆలయ అధికారులు ఇప్పటికే సన్నాహాలు పూర్తిచేశారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏకాదశి ఒక్కరోజునే సుమారు లక్ష మంది భక్తులు స్వామిని దర్శించుకునే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

దక్షిణావృత శంఖం

వైకుంఠ ఏకాదశి రోజున దక్షిణావృత శంఖంతో భక్తులకు తీర్థం అందించడం ఆనవాయితీగా వస్తోంది. 1820లో తంజావూరు మహారాజు వారణాసి యాత్రలో భాగంగా మార్గమధ్యలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని బంగారు తొడుగు గల దక్షిణావృత శంఖాన్ని సమర్పించారు. అప్పటి నుంచి ఏటా ముక్కోటి ఏకాదశి రోజున ఈ శంఖంతో లక్ష్మీ నరసింహస్వామికి అభిషేకం చేస్తారు. ఆ శంఖం ద్వారానే భక్తులకు తీర్థం అందిస్తారు. ఈ శంఖం నుంచి నిత్యం ఓంకారం నాదం వినిపిస్తుంటుందని చెబుతారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

ముక్కోటి సందర్భంగా ఉత్సవ, భద్రతా ఏర్పాట్లను ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం ఆలయ ఈఓ రామకోటిరెడ్డితో కలిసి పరిశీలించారు. సుమారు 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణ, రూరల్ సీఐలు వినోద్‌కుమార్, శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు ఉత్సవాలు

మంగళాద్రి క్షేత్రంలో జనవరి 9,10 తేదీల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 9వ తేదీ జాగరణ సందర్భంగా భజనలు, అన్నమయ్య సంకీర్తనలు, పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం స్వామిని జగన్మోహిని రూపంలో అలంకరించి పుష్పక విమానంపై ఊరేగిస్తారు. అర్ధరాత్రి దాటిన తరువాత తిరుమంజన ఉత్సవం నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10న శుక్రవారం వేకువ జామున 4 గంటల నుంచి స్వామి ఉత్తర ద్వార దర్శనభాగ్యం కల్పిస్తారు. మధ్యాహ్నం స్వామి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. దక్షిణావృత శంఖు తీర్థాన్ని 9, 10 తేదీల్లో ఇస్తారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

జె.పంగులూరు: మండల కేంద్రం అయిన పంగులూరులో గల విద్యుత్ సబ్‌స్టేషన్ విస్తరణలో భాగంగా గురువారం సాయంత్రం రెండు గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ గొరంట్ల అనిల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ప్రకటన గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

చందలూరులో అగ్ని ప్రమాదం

జె.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు గ్రామంలో బుధవారం ఓ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో రూ. 5 లక్షల విలువ చేసే రెస్టారెంట్ సామగ్రి దగ్ధమైంది. అద్దంకి నుంచి ఫైర్ ఇంజన్ అధికారులు మంటలు అదుపులోకి తెచ్చారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

బల్లికురవ: రోడ్డు మలుపులో టిప్పరు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి బల్లికురవ–సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్డులోని ఈర్లకొండ సమీపంలో జరిగింది. వెంకటేశ్వర స్టోన్ క్రషర్‌కు చెందిన టిప్పర్ సంతమాగులూరు వైపు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలి

చీరాల టౌన్: పంచాయితీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీఎం మధు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

12న షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

కారంచేడు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీన మండల కేంద్రమైన కారంచేడులో డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలా 2025 షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 11 లోపు రూ. 400 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9966164412 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

ఉత్సాహంగా అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు

భ్రమర సంక్రాంతి కప్–2025 పోటీలు ప్రారంభం

మేదరమెట్ల: కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భ్రమర సంక్రాంతి కప్–2025 క్రికెట్ పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 ఏళ్లుగా నిర్విరామంగా క్రికెట్ పోటీలు నిర్వహించడం గ్రామస్తుల ఐకమత్యానికి నిదర్శనగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ నటుడు యర్రా రఘుబాబు మాట్లాడుతూ గ్రామస్తులు, ఆర్ఎస్‌సీఏ సభ్యుల సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. ప్రారంభానికి ముందు కొద్ది సేపు బ్యాటింగ్ చేసి, ప్రేక్షకులను అలరించారు. భ్రమర టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి క్రికెట్ పోటీల బహుమతులను అందజేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం అక్కడే నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ షటిల్ కోర్టును భారత సమాఖ్య బ్యాడ్మింటన్ మాజీ కార్యదర్శి కరణం చెంచు పున్నయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు (బాబు) తదితరులు పాల్గొన్నారు.



అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

గుంటూరుదే విజయం

తొలిరోజు స్పార్టన్ వారియర్స్ తిరుపతి, జీడీసీఏ లెవెన్ గుంటూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్ ఆరంభించిన తిరుపతి టీమ్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఓపెనర్లు దత్తారెడ్డి (26), కల్యాణ్ (27) మొదటి వికెట్‌కు 63 పరుగులు జోడించారు. గుంటూరు బౌలర్ సాయిరాహుల్ 3 వికెట్లు పడగొట్టాడు. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుంటూరు జట్టు 19.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి.. 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. బ్యాటర్ మహీప్ కుమార్ 49 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నిఖిత్ గౌడ్ (35), సాయిరాహుల్ (32) రాణించారు. తిరుపతి బౌలర్ ప్రవీణ్ వాట్సన్ 3 వికెట్లు తీసుకున్నాడు. అంపైర్లుగా శ్రీనివాస్, రాజు, స్కోరర్‌గా సాయిరాజ్ వ్యవహరించారు.

నేటి మ్యాచ్‌లు

ఉదయం మ్యాచ్ నెక్స్ జెన్ సీసీ లెవెన్ హైదరాబాద్ – మస్తాన్ లెవెన్ మార్టూరు జట్లు, మధ్యాహ్నం ఎంఆర్‌సీసీ లెవెన్ చెన్నై – సౌత్ సెంట్రల్ రైల్వేస్ సికింద్రాబాద్ జట్లు తలపడనున్నాయి.



రావినూతలలో ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభోత్సవం



బ్యాటింగ్ చేస్తున్న సినీ నటుడు యర్రా రఘుబాబు

ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

జె.పంగులూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య గంగయ్య డిమాండ్ చేశారు. పంగులూరులో బుధవారం సీపీఎం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ పంగులూరు మండలంలోని రామకూరులో రైతులు సుమారు 400 ఎకరాల్లో మాగాణి సాగు చేశారన్నారు. ప్రస్తుతం ధాన్యం నూర్పిడి జరుగుతోందని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ప్రయివేటు వ్యాపారులు రైతులను వారి అవసరాలను గుర్తించి తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని, బస్తా రూ. 1400 అడుగుతున్నారన్నారు. ప్రభుత్వం బస్తా రూ. 1740 కు కొనుగోలు చేస్తామని చెబుతోందన్నారు. అధికారులు రామకూరు గ్రామంలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని గత 15 రోజులుగా చెబుతున్నప్పటికీ ఇంతవరకు ముందుకు రాలేదన్నారు. సీపీఎం జిల్లా నాయకులు తలపనేని రామారావు, రాయిణి వినోద్‌బాబు, మండల కమిటీ సభ్యులు మానం హరిబాబు, నాయపాలు ప్రభాకర్, పూసపాటి సుబ్బరాజు, పాలపర్తి ఏలియా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

మాజీ సీఎం జగన్‌ను కలిసిన అద్దంకి నాయకులు



జగన్‌తో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్



జగన్ మోహన్ రెడ్డితో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



వైఎస్ జగన్‌తో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు రఘురామ గుప్తా

జె.పంగులూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, బాపట్ల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, బాపట్ల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు గునుపూడి రఘురామ గుప్తా బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగన్ ఈ సందర్భంగా కోరారు.

పురుగు మందులు అధికంగా వాడవద్దు

యద్దనపూడి: సాగులో మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వాడవద్దని వ్యవసాయాధికారి మేరమ్మ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని జాగర్లమూడి, పడమరపెద్దివారిపాలెం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులు సాగుచేసిన శనగ, పొగాకు, మిర్చి పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చీరాల రూరల్: క్రీడలు శరీర దృఢత్వాన్ని కలిగించడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని, ప్రశాంతతను కలిగిస్తాయని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు క్రీడా పోటీలు నిర్వహించారు. న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహనలు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ రాజా సాల్మన్‌ను అభినందించారు. పలు రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఎ. రాజా సాల్మన్, నాశన రామకోటేశ్వరరావు, జీకే ఈశ్వరి రెడ్డి, ఎస్‌డీ కరుణకుమారి, కొండమ్మ, సీతా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుప్పావై ప్రవచనం



అమ్మవారికి సారె ఇస్తున్న మహిళా భక్తులు

అద్దంకి: ధనుర్మాస సందర్భంగా పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం తిరుప్పావై ప్రవచనం చేశారు. దానిలో భాగంగా తిరుప్పావై ప్రవచనం, ధనుర్మాస విశేషాలను భక్తులకు వివరించారు. ఆండాళ్లమ్మ పాసురాలను ప్రవచనం, విష్ణ సహస్ర నామం చేశారు. ఒడికట్టు బియ్యం, అమ్మవారికి సారె పెట్టారు. దక్షిణాయన కాలంలో మానవునికి ఉన్నతి కలుగుతుందని శాస్త్రం చెబుతోందని చెప్పారు. ఆండాళ్లమ్మ తల్లిని ఒదరూ అనుసరించాలని కోరారు. తరువాత హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పందిళ్లపల్లి హైస్కూల్ తనిఖీ

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పి. వెంకటేష్ నాయక్, జిల్లా రిసోర్స్ పర్సన్ వై. కుమారి, బి. సంజన్న బుధవారం తనిఖీ చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ వైస్ చైర్మన్ బండ్ల భారతి, స్టాఫ్ సెక్రటరీ బుద్దిమోహనరావు, ఉమ్మిటి వేణుగోపాలరావు, రికార్డు అసిస్టెంట్ సుజాత పాల్గొన్నారు.

250 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నిజాంపట్నం: నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను అదవల మడ అడవుల్లో స్వాధీనం చేసుకుని, ధ్వంసం చేసినట్లు బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ బాపట్ల జిల్లా ఏఈఎస్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. దిండి పంచాయతీ అదవల గ్రామ పరిసరాల్లో రేపల్లె, నగరం సీఐలు దివాకర్, శ్రీరామ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలోని మడ అడవుల్లో 250 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని, ధ్వంసం చేశారు. పరిశావారిపాలెం, జంపనివారిపాలెం, కేసనవారిపాలెం, యేమినేనివారిపాలెం తదితర గ్రామాల్లోనూ నాటుసారా తయారీ చేస్తున్నట్లు సమాచారం ఉందని అధికారులు తెలిపారు. ఆయా గ్రామాలపై తమ సిబ్బందితో నిరంతరం నిఘా ఉంచుతామని చెప్పారు. నాటుసారా తయారీకి అవసరమైన నల్ల బెల్లం, ముడి సరుకులు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసరెడ్డి, కె.మధుసూదన్‌రావు, పి.శ్రీనివాసరెడ్డి స్టేషన్ సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.



బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది

మెరుగైన వైద్య సేవలకు 104 వైద్య శిబిరాలు

జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

నగరం: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు 104 అంబులెన్స్ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మండలంలోని ఏలేటిపాలెంలో బుధవారం జరిగిన వైద్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. హాజరైన వారిని వైద్య సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ నాగేశ్వరావు, డాక్టర్ నజీలాపర్వీన్, సీహెచ్‌వో బాబురావు, పీహెచ్ఎన్ కోటేశ్వరమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో డాక్టర్ ప్రవీణ్‌కుమార్

'యూటీఎఫ్' సభలకు తరలిన నాయకులు

కారంచేడు: కాకినాడలో ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరుగుతున్న యూటీఎఫ్ 7వ విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలకు మండలంలోని యూటీఎఫ్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు, మండల శాఖ నాయకులు సైతం వారికి అనుకూలమైన తేదీల్లో సభలకు హాజరవుతున్నారు. చివరి రోజున యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భవనం శ్రీనివాసరెడ్డి, బాపట్ల జిల్లా కార్యదర్శి రావి పద్మావతి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. శ్రీనివాసరావు, జి. రమేష్‌రెడ్డి, నాయకులు ఎస్‌కే సుభానీ, ఎస్‌కే హుస్సేన్ సాహెబ్, ఎం. ప్రమీల, శీరాం శ్రీనివాసరావు, కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, తిమిడెదపాడు గ్రామాల నుంచి వెళ్లారు. యూటీఎఫ్ బాపట్ల జిల్లా కార్యదర్శి రావి పద్మావతి పేర్కొన్నారు.



కాకినాడ మహాసభలకు తరలివెళ్తున్న కారంచేడు యూటీఎఫ్ నాయకులు

దాతల సాయం మరువలేనిది

యద్దనపూడి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం మరువలేనిదని ప్రధానోపాధ్యాయుడు రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలోని కొల్లా వీర వసంతరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వింజనంపాడు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు తూమాటి కిషోర్ విద్యార్థుల సౌకర్యార్థం రూ.1,65 వేలు విలువ కలిగిన 50 బెంచీలను పాఠశాలకు అందజేశారు. బుధవారం కిషోర్ తల్లిగారైన రాజేశ్వరి వారి సోదరుడు శ్రీనివాసు, బాలకృష్ణ పాఠశాలకు బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ దాత తూమాటి కిషోర్ గత సంవత్సరం కూడా పాఠశాలలోని భోజనశాల, సమావేశ గదిని రూ.1,65 వేలతో ఆధునీకీకరించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల సంఘ అధ్యక్షురాలు రమాదేవి, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు తుర్లపాటి శ్రీనివాసు, పూర్వవిద్యార్థి పెడవల్లి రమేష్, మండవ నరేంద్ర, కొత్తపల్లి రాఘవ, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



పాఠశాలకు బెంచీలను సమకూర్చిన దాత కుటుంబ సభ్యులు

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

సంత మాగులూరు (అద్దంకి): సస్య రక్షణ చర్యలతో కందిలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కొత్రపాటి వెంకట కృష్ణ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మైలవరం, ఉప్పలపాడు గ్రామాల్లో రైతలకు కంది పంటలో అధికదిగుబడులు సాధించడానికి అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. రైతులు వ్యవసాయధారుల సూచనలు సలహాలను పాటించాలని కోరారు.



సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి వెంకట కృష్ణ

డివైడర్‌ను ఢీకొన్న కారు

మేదరమెట్ల: మోటారు బైకును తప్పించబోయిన కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్న సంఘటన బొడ్డువానిపాలెం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. హైదరాబాద్ వైపు నుంచి తిరుపతికి వెళుతున్న కారు బొడ్డువానిపాలెం సెంటర్ సమీపానికి రాగానే పెట్రోల్ బంకులో పెట్రోలు కొట్టించుకొని అద్దంకి వెళ్ళేందుకు వస్తున్న మోటారు బైకును తప్పించపోయి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో కారు టైర్లు పగిలిపోయాయి. అదృష్ట వశాత్తు కారులో వారికి ఎలాంటి గాయాలు కాలేదు.



బొడ్డువానిపాలెం వద్ద డివైడర్‌ను ఢీ కొన్న కారు

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చీరాల అర్బన్: సంక్రాంతి పండగకు దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వెళ్లేవారి కోసం ఆర్టీసీ చీరాల డిపో ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల బుధవారం తెలిపారు. హైదరాబాద్ నుంచి చీరాలకు ఆరు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. అలానే సంక్రాంతి పండుగ అనంతరం తిరిగి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

బల్లికురవ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్రి ప్రమాదం సంభవించగా బుధవారం బాధిత కుటుంబానికి రెవెన్యూ శాఖ చేయూతనిచ్చింది. మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి పల్లపు పద్మ నివాస గృహం అగ్రి ప్రమాదానికి గురైంది. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ రెవెన్యూ సిబ్బంది 25 కేజీల బియ్యం నిత్యావసరాలను పద్మకు అందజేశారు. ఆర్ఐ పోతురాజు, వీఆర్వో వెంకటేశ్వర్లు స్థానిక నేతలు దద్దాల అంజయ్య, మండలపు సుధాకర్ పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న డీటీ, రెవెన్యూ సిబ్బంది

క్లుప్తంగా

అంగన్‌వాడీలు బాధ్యతాయుతంగా ఉండాలి

సీడీపీవో సుచిత్ర



రేపల్లె రూరల్: అంగన్‌వాడీలు తమ విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని సీడీపీవో సుచిత్ర అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల ప్రాజెక్ట్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రానికి వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అందించే సంక్షేమ లబ్ధి వివరాలు, ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని చెప్పారు. బాలింతలు, తల్లులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. కిశోర బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. కేంద్రంలో చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ భోజనం అందించాలన్నారు. సమావేశంలో కో ఆర్డినేటర్ త్రివేణి, సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలు రాక సర్వసభ్య సమావేశం వాయిదా



కర్లపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాకపోవటంతో నిర్వధికంగా వాయిదా పడినట్లు ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. తొలుత మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ యారం వనజ పలువురు సర్పంచ్‌లు అధికారులు హాజరైనప్పటికీ మండల పరిధిలో ఉన్న 14 మంది ఎంపీటీసీ సభ్యులలో ఎవరూ హాజరు కాకపోవటంతో బుధవారానికి వాయిదా వేశారు. మళ్లీ బుధవారం ఎంపీపీ యారం వనజతో సహా ఎంపీటీసీ సభ్యులెవరూ హాజరు కాకపోవటంతో సర్వసభ్య సమావేశాన్ని నిర్వధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి సంబంధించిన సమాచారం ముందుగానే ఎంపీటీసీ సభ్యులందరికీ తెలియజేయటంతో పాటు ఫోన్ చేసి ఆహ్వానించామని అయినప్పటికీ సభ్యులెవరూ హాజరుకాకపోటంతో నిర్వధికంగా వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం



భట్టిప్రోలు: శ్రీ సత్యసాయి సేవా సమితి(పెదలంక), భట్టిప్రోలు భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టీఎం రావు హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్లకు చెందిన ప్రముఖ దంత వైద్యులు హనుమంతరావు నాయుడు-హిమజ బృందం శిబిరంలో 70 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి దంతాలను శుభ్రం చేయడం సిమెంట్ పెట్టడం, పిప్పి పళ్లను తల్లిదండ్రుల అనుమతితో తొలగించారు. అలాగే ఉచితంగా మందులు కూడా అందచేశారు. అనంతరం దంతాల ఆవశ్యకత, శుభ్రతపై విద్యార్థులకు వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామ కోటేశ్వరరావు, భజన మండలి నిర్వాహకులు మానేపల్లి వెంకట సుబ్బారావు, శ్రీరామకృష్ణ, (వేమవరం), కొతరపు ప్రసాద్, జిల్లా ఆధ్యాత్మిక కన్వీనర్ అన్నె రవికుమార్, ధారా నారాయణ మూర్తి, గ్రామ సేవా కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, పెదలంక సమితి నిర్వాహకులు వేములపల్లి బసవపున్నయ్య, వేములపల్లి వెంకటేశ్వరరావు, మానేపల్లి శశికళ, తూనుగుంట్ల నాగమణి, మానేపల్లి సాయి పాల్గొన్నారు.

పింఛన్లు పొందుతున్న వారికి వైద్య పరీక్షలు



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీ పరిధిలోని పెదపులివర్రు, ఓలేరు, వెల్లటూరు, పెదలంక, గొరిగపూడి సచివాలయాల పరిధిలో వికలాంగ పింఛన్లు పొందుతున్న వారికి బుధవారం 2వ రోజు గుంటూరు జీజీహెచ్‌కి చెందిన వైద్యులు బి.శ్రీనివాసరావు ఎండీ జనరల్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), డాక్టర్ జయకృష్ణ ఎంఎస్ ఆర్థో (అసిస్టెంట్ ప్రొఫెసర్)లు 20 మందిని పరీక్షించారు. వీరు రూ.15 వేలు వికలాంగ పింఛన్ పొందేందుకు అర్హులా కాదా అనే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సందిగ్ధంలో సచివాలయాలు

- కూటమి ప్రభుత్వంలో సచివాలయ భవనాలకు గ్రహణం
- అర్ధంతరంగా ఆగిపోయిన నిర్మాణాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పలు సేవలను అందించారు. సచివాలయ భవనాలకు నిధులు కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని భవనాల నిర్మాణం నిలిచిపోయింది. అనంతరం ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం సచివాలయ భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. దీంతో సచివాలయాల భవనాలు పూర్తయి సేవలు అందుబాటులోకి వస్తాయో.. రావో తెలియని సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు.



నగరం మండలం బోరమాదిగపల్లిలో నిర్మాణం ఆగిపోయిన సచివాలయం

రేపల్లె రూరల్: ప్రభుత్వ పౌర సేవలను గ్రామీణ ప్రాంత ప్రజల ముంగిటకు చేర్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నెలకొల్పి ప్రతి గ్రామంలో సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామంలో సచివాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించింది. దీంతో పలు గ్రామాలలో సచివాలయాలు పూర్తయి వినియోగంలోకి రాగా పలు గ్రామాలలో నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఎన్నికల కోడ్ రావటంతో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో సచివాలయ భవన నిర్మాణాలకు గ్రహణం పట్టింది. సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కూటమి పాలకులు కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోంది.

సచివాలయాలపై నిర్లక్ష్యం

సచివాలయ భవన నిర్మాణాలపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. రేపల్లె నియోజకవర్గంలో 66 సచివాలయాల భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. అన్ని హంగులతో పరిపాలనా సౌలభ్యం కోసం విశాలమైన గదులతో నిర్మించేందుకు ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించింది. ఎన్నికల కోడ్ వచ్చిన నాటికి నియోజకవర్గంలో 15 సచివాలయ భవనాలు పూర్తయి వినియోగంలోకి రాగా 51 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి.

నియోజకవర్గంలో ఇలా...

రేపల్లె మండలంలో 16 సచివాలయాలకు- 8 భవనాలు పూర్తవ్వగా మిగిలిన 8 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. నగరం మండలంలో 16 భవనాలకు 2 పూర్తవ్వగా 14 వివిధ దశల్లో ఉండగా, చెరుకుపల్లి మండలంలో 16 భవనాలకు 5 భవనాలు పూర్తవ్వగా 11 వివిధ దశల్లో ఉన్నాయి. అదే విధంగా నిజాంపట్నం మండలంలో 18 భవనాలకు అన్నీ వివిధ దశల్లోనే ఉన్నాయి. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సచివాలయ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రేపల్లె మండలం పేటేరులో నిర్మాణం ఆగిపోయిన సచివాలయం

గ్రామాల ముంగిటకే సేవలు

సచివాలయాల ఏర్పాటుతో గ్రామాల ముంగిటకే పలురకాల సేవలు చేరాయి. దీంతో గ్రామీణులు దూరంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు పెట్టకుండా తమ గ్రామంలో ప్రభుత్వ సేవలను పొందుతున్నారు. సచివాలయ వ్యవస్థను పలు రాష్ట్ర ప్రభుత్వాలు సైతం భేష్‌గా ఉన్నదంటూ కితాబునిచ్చిన విషయం అందరికి తెలిసిందే. సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవటం, పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, మృతుల సర్టిఫికెట్‌లతో పాటు కుల, ఆదాయ, స్థిర నివాస పత్రాలను పొందవచ్చు. పొలాలకు సంబంధించిన పలు పత్రాలను సైతం పొందే అవకాశం గత ప్రభుత్వం కల్పించింది. అటువంటి సచివాలయాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరుగున పడవేస్తుండటంతో పలువురు ప్రజా సంఘాలు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంట కాల్వల అభివృద్ధికి ప్రణాళికలు

ఇరిగేషన్ ఏఈ సువర్చల



నగరం: పంట కాల్వలను అభివృద్ధి పరిచేందకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ ఎస్. సువర్చల చెప్పారు. నగరంలోని పక్కలమ్మ తల్లి ప్రాంగణంలో బుధవారం 246, 247, 249, 250 చానల్ నీటి సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఏఈ సువర్చల మాట్లాడుతూ పంటకాల్వలు, మురుగు కాల్వల అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో తీర్మానం చేసిన వాటికి అనుగుణంగా పంట కాల్వల మరమ్మతు పనులు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డ్రైనేజ్ ఏఈ ఎస్.రాంబాబు, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బోడపాడులో రెవెన్యూ సదస్సు



వేమూరు(అమర్తలూరు): రైతుల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని తహసీల్దారు నెహ్రూ తెలిపారు. అమర్తలూరు మండలంలోని బోడపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. రైతులు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శివయ్య, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గత ఏడాది నవంబర్‌లో సీజ్ చేసిన రికార్డులను పరిశీలించేందుకు బుధవారం జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు ఆధ్వర్యంలో డీఎల్‌పీవో నరసింహారావు, రాఘవన్ (రంపచోడవరం)లు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీరువాలో భద్రపరచిన రికార్డులను పరిశీలించారు. పంచాయతీలో జరిగిన కార్యకలాపాల నివేదికలను పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదించనున్నట్లు సీఈవో పేర్కొన్నారు. అనంతరం అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థానిక బౌద్ధ స్థూపం ఎదురుగా మానేపల్లి వారి చెరువు వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఆ తరువాత వెల్లటూరులోని గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలో 7 లంక గ్రామాలకు తాగు నీరు అందించే సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించి వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఎంపీడీవో ఎస్.వెంకట రమణ, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు కోట శ్రీనివాసరావు, ఆర్.భూషణం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రదీప్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



భట్టిప్రోలు పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు పక్కన అధికారులు

గ్రామ సభలు ప్రారంభం

భట్టిప్రోలు: పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశానుసారం భట్టిప్రోలులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (జీపీడీపీ) 2025-26 ఆర్థిక సంవత్సరానికి భట్టిప్రోలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మొదటి విడత గ్రామ సభలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ముందుగా మహిళలు, పిల్లల సామాజిక అత్యవసరాలు గుర్తించడం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకునేందుకు మొదటి విడత గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. రాచూరు, గొరిగపూడి, ఓలేరు, కన్నెగంటివారిపాలెం, పెదపులివర్రు, అల్లమూడి, కోనేటిపురం గ్రామాలలో సర్పంచులు జయవరపు రాధాకృష్ణమూర్తి, గరికపాటి మల్లిక, నీలా ఉషారాణి, పెద్దిశెట్టి రాంబాబు, మోర్ల వెంకటేశ్వరమ్మ, గొట్టిముక్కల రమాదేవిల అధ్యక్షతన జరిగిన గ్రామ సభలను కార్యదర్శులు వక్కలగడ్డ సురేష్, గోలి శ్రీనివాసరావు, మాంజీ నాయక్, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, ప్రదీప్, ఎ.చిన వెంకటేష్ బాబులు నిర్వహించారు. గురువారం సూరేపల్లి, ఐలవరం, భట్టిప్రోలు, చింతమోటు, పెదలంక గ్రామాలలో సభలు జరగనున్నాయి. గ్రామ సభలను ఎంపీడీవో ఎస్ వెంకట రమణ పర్యవేక్షించారు.



రాచూరులో గ్రామ సభలో మాట్లాడుతున్న కార్యదర్శి సురేష్, పక్కన సర్పంచ్

సత్యసాయి హైస్కూల్ కరస్పాండెంట్ గోపాలరావు అస్తమయం



రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పుడి రోడ్డులో ఉన్న శ్రీభగవాన్ సత్యసాయి హైస్కూలు వ్యవస్థాపకుడు, కరస్పాండెంట్ కొండపనేని వెంకట గోపాలరావు బుధవారం ఉదయం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గరువురోడ్డులోని తన నివాసంలో మృతి చెందారు. గోపాలరావుకు ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వెంకట గోపాలరావు భగవాన్ సత్యసాయి హైస్కూలు నెలకొల్పి అనేక మంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న పట్టణంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పాఠశాల పూర్వ విద్యార్థులు సంతాపం తెలిపారు.

16 లోగా కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలను అందించేందుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలతో పాటు ఈడబ్ల్యూఎస్ వర్గానికి చెందిన ఈబీసీ, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణులకు రుణాలు అందించబడునన్నారు. 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో 21-60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నగరం: బీసీ కార్పొరేషన్ ద్వారా బ్యాంక్ లింక్ రాయితీ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హత ఉన్న వారు ఈ నెల 16 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అమర్తలూరు(వేమూరు): అగ్ర వర్ణ పేదలకు బ్యాంక్ లింక్ రాయితీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మారుతీ శేషామాంబ బుధవారం తెలిపారు. ఈ నెల 16 వరకు గడవు ఉందన్నారు. అర్హులైన వ్యక్తులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

వేమూరు: బీసీ అగ్ర వర్ణ పేదలు స్వయం ఉపాధి రుణాల కోసం బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో శివన్నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోనేందుకు 50 శాతం సబ్సిడీపై రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా బాల నారాయణ



బాపట్ల: భారతీయ జనతా పార్టీ బాపట్ల పట్టణ నూతన అధ్యక్షుడిగా బ్రహ్మాండం బాల నారాయణని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారిగా యడ్లపాటి స్వరూపారాణి, జగన్నాథ శాస్త్రి వ్యవహరించగా బ్రహ్మాండం బాల నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బాల నారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ లక్ష్మీనారాయణ, మామిడి రమేష్‌కుమార్, అడపాల శ్రీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో సస్యరక్షణ తప్పనిసరి

ఏడీఏ విజయ్‌బాబు

రేపల్లె రూరల్: మొక్కజొన్న సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా అవలంబించాలని ఏడీఏ ఆర్.విజయ్‌బాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని బేతపూడి-1, 2 గ్రామాలలో బుధవారం మొక్కజొన్న పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రబీ సీజన్‌లో సాగు చేసే పంటలలో మొక్కజొన్నకు తీరంలో రైతులు అధిక ప్రాధాన్యతనిస్తారని పేర్కొన్నారు. ఈ సాగులో విత్తనం మొలిచిన అనంతరం 10 నుంచి 15 రోజులలోపు కాండం తొలుచు పురుగు ఆశిస్తుందన్నారు. మోనోక్రోటోపాస్ లీటరు నీటికి 1.6 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే 25 నుంచి 30 రోజుల తరువాత ఎకరానికి 3 కిలోల కార్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలు ఆకుసుడుల్లో వేయాలన్నారు. నెల రోజుల పైబడిన పైరులో పేనుబంక, చిగురునల్లి ఆశిస్తుందని, మోనోక్రోటోపాస్ గానీ, డైమిథోయేట్ గానీ పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): జొన్న, మొక్క జొన్న పంటలకు రైతులు రసాయన ఎరువులు విచక్షణా రహితంగా వాడరాదని మండల వ్యవసాయాధికారి వుయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి, మూల్పూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మొక్కజొన్న పైరులో కాండం తొలిచే పురుగు వ్యాపిస్తుందని నివారణకు కార్బొఫ్యూరాన్, క్లోరాంత్రినిఫోస్ కలిసిన మందును పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు మణిపూజ్య, పృథ్వీరాజ్ సర్పంచ్ పెదపూడి ఆనంద్, రైతులు పాల్గొన్నారు.



బేతపూడిలో సాగు భూమిని పరిశీలిస్తున్న ఏడీఏ విజయ్‌బాబు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం ఐలవరం-2, కోనేటిపురం గ్రామాలలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖాధికారి కె.లక్ష్మీప్రసన్న మినుములో వచ్చే తెగుళ్లు, పురుగుల ఉధృతిపై రైతులకు వివరించారు. పంట పొలాల్లో అక్కడక్కడ పల్లాకు తెగుళ్లు ఉండటాన్ని గుర్తించారు. నివారణకు పొలం గట్లపై కలుపు నివారణ, తెగులు సోకిన మొక్కలను పీకి కాల్చి వేయడం చేయాలని సూచించారు. తెల్ల దోమ ఉనికి గుర్తించడం కోసం పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తెల్ల దోమ ఉన్నట్లయితే వేప కషాయం 5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో టి.అఖిల, బి.శివ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను మండల వ్యవసాయాధికారి ఆదంబాబు తెలిపారు. చుండూరు మండలంలోని దుండిపాలెం, యడ్లపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని, గట్లను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గొంగళి పురుగు నివారణకు ఏమామెక్టిన్, బెంజాయేట్ 80 గ్రాములు లేదా స్పైనోసాడ్ 45 నుంచి 60 శాతం వరకు పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎం ఫసల్ బీమా యోజన, ఈ పంట నమోదుపై రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది తెలియజేశారు.



మూల్పూరు గ్రామంలో పొలం పిలుస్తోంది



కోనేటిపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో లక్ష్మీప్రసన్న, వ్యవసాయ సిబ్బంది, రైతులు



యడ్లపల్లిలో పొలం పిలుస్తోంది

హత్య కేసు నిందితుడి అరెస్ట్



నగరం: చినమట్లపూడిలో ఈ నెల 1న జరిగిన హత్య కేసులో నిందితుడైన భాస్కరుని వెంకట సాంబశివరావును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బండ్ల భార్గవ్ చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. జనవరి 1న చినమట్లపూడిలో లుక్కా నాగరాజు హత్య జరిగిందని, నిందితుడైన సాంబశివరావును అదుపులోకి తీసుకుని హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడ్ని రేపల్లె కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు

భట్టిప్రోలు: ముందస్తు సంక్రాంతి వేడుకలలో భాగంగా బుధవారం భట్టిప్రోలులోని మాతా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 5 నుంచి 10వ తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా కొత్తా సాయి లక్ష్మి మణిదీపిక, బూర్లె అరుణ కుమారిలు వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రిన్సిపాల్ కె.నాగ వెంకట రవి తేజ పర్యవేక్షించారు.

కర్లపాలెం: మండల కేంద్రంలోని కర్లపాలెం హైవెండ్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో పాఠశాలలోని చిన్నారులందరూ సంక్రాంతి సంబరాలలో పాల్గొన్నారు. బాలికలు సంక్రాంతి విశిష్టతను తెలిపే విధంగా రంగవల్లులు తీర్చిదిద్దారు. విద్యార్థులు గాలి పటాలను ఎగురవేశారు. సంక్రాంతి పండుగకు సంప్రదాయంగా వస్తున్న కోడి పందేలు వేసి సందడి చేశారు. కార్యక్రమంలో హైవెండ్ హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాతా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో...



హైవెండ్ హైస్కూల్‌లో ...

ప్రమాదం చోటుచేసుకోనిదే పట్టించుకోరా..?



కొల్లూరు: ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యవహరించడం విద్యార్థులు, వాహనదారుల పాలిట శాపంగా మారనుంది. ఏపీ ఫైబర్ నెట్‌కు సంబంధించిన 24లీడ్‌లతో ఉన్న ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెలల తరబడి లంక గ్రామాలకు వెళ్లే లాక్ సెంటర్ రోడ్డుపై అడ్డంగా పడి ఉండటం ప్రమాదకరంగా తయారైంది. కొల్లూరు బాలికలు, బాలురోన్నత పాఠశాలల వద్ద రహదారికి అడ్డుగా ఫైబర్ నెట్ వైర్ పడి ఉండటంతో ఎప్పుడు ఎవరు ప్రమాదం బారిన పడాల్సి వస్తుందోనన్న ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు, వాహనదారులలో వ్యక్తమవుతుంది. నిరంతరం భారీ వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో లారీలు ఫైబర్ నెట్ వైర్‌పై నుంచి ప్రయాణిస్తున్న సమయంలో వైరు విద్యార్థుల సైకిళ్లు, ద్విచక్ర వాహనాలకు చుట్టుకొని ప్రమాదాలు చోటుచేసుకునే ముప్పు పొంచి ఉంది. ప్రభుత్వ యంత్రాంగం తక్షణం స్పందించి రహదారికి అడ్డుగా ఉన్న వైర్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.